ఔటర్ 'ఎగ్జిట్ -15' ఎత్తు పెంపు

తొలగనున్న వరద నీటి అడ్డంకి



పెద్దగోల్కొండ వద్ద ఎగ్జిట్-15 వద్ద మూసివేసిన టోల్‌గేటు

శంషాబాద్ రూరల్: ఔటర్ రింగు రోడ్డుపై ఎగ్జిట్-15 వద్ద వరద నీటి అడ్డంకులు తొలగిపోనున్నాయి. జంక్షన్ వద్ద రోడ్డు ఎత్తు పెంచుతున్నారు. భారీ వర్షాలతో గత రెండేళ్ల నుంచి వరదనీటి కారణంగా నెలల కొద్ది వాహనాల రాకపోకలు నిలిచిపోతున్నాయి. దీంతో జంక్షన్ చుట్టూ రోడ్డు ఎత్తు పెంచేశారు. నాలుగు నెలల నుంచి పనులు కొనసాగుతున్నాయి.

రూ.తొమ్మిది కోట్లతో పనులు..

- పెద్దగోల్కొండ రోటరీ జంక్షన్ వద్ద ఉన్న ఔటర్ ఎగ్జిట్-15 ప్రాంతంలో రూ.తొమ్మిది కోట్ల నిధులతో హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో పనులు చేపట్టారు. రోడ్డును 1.1 మీటరు ఎత్తు పెంచుతున్నారు. వీటితో పాటు నాలుగు టోల్‌గేట్లు ఎత్తు, డ్రైనేజీ, రిటైనింగ్ వాల్స్, వీధిదీపాలు, కరెంటు కేబుల్ ఏర్పాటు పనులు కొనసాగుతున్నాయి.

భారీ వాహనాల నిషేధం..

- ఎగ్జిట్-15 వద్ద రోడ్డు ఎత్తు పెంచడంతో జంక్షన్ నుంచి భారీ వాహనాల రాకపోకలు నిషేధించనున్నారు. బస్సులు, ఇతర వాహనాలకు ఇబ్బందులు లేనప్పటికీ.. సరుకులు, ఇతర భారీ సామాగ్రి తరలించే వాహనాలను ఇక్కడ అనుమతించరు. దీనికోసం జంక్షన్ చుట్టూ ఉన్న ప్రధాన మార్గాల్లో భారీకేడ్లు ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం పనులు జరుగుతుండగా.. భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. కొన్ని వాహనాలు జంక్షన్ వద్ద వంతెన పైకప్పు తగిలి అక్కడే ఇరుక్కుపోయిన ఘటనలు కూడా ఉన్నాయి. భవిష్యత్తులో భారీ వాహనాలు రాకుండా అధికారులు చర్యలు తీసుకోనున్నారు.



వరదనీరు నిలిచిన దృశ్యం (ఫైల్)

వర్షాలు కురిస్తే..

- వానాకాలం రాకముందే పనులు పూర్తి చేయాల్సి ఉండగా.. పనుల్లో జాప్యం కారణంగా డ్రైనేజీ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. ఇక టోల్‌గేట్ల వద్ద ఎలక్ట్రిక్ పనులతో పాటు వాటి ఎత్తును పెంచాల్సి ఉంది. ఇటీవల కురిసిన వర్షాలతో టోల్‌గేటు ఎలక్ట్రిక్ తీగలు నీట మునిగి గేటు మూత పడింది. జంక్షన్ నుంచి తుక్కుగూడ వైపు వెళ్లే మార్గంలో టోలుగేట్‌ను నాలుగు రోజుల పాటు మూసివేశారు. దీంతో విజయవాడ వైపు వెళ్లే వాహనదారులు ఔటర్ పైకి చేరుకోవాలంటే తుక్కుగూడ వరకు సర్వీస్ మార్గంలో చేరుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. వర్షాకాలం మొదలు కావడంతో భారీ వర్షాలు కురిస్తే వరదనీటి కష్టాలు తప్పవేమోనని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
- బెంగళూరు జాతీయ రహదారికి పెద్దగోల్కొండ జంక్షన్ నుంచి అనుసంధానంగా ఉన్న పీ-వన్ రోడ్డుపై రాకపోకలు సాగించే వాహనాలు కూడా ఇక్కడి నుంచే వెళ్లాలి. మహేశ్వరం, శంషాబాద్, గచ్చిబౌలి ప్రాంతాలతో పాటు తుక్కుగూడ, బొంగుళూరు ఔటర్ జంక్షన్ నుంచి వాహనాల రాకపోకలు ఇక్కడి నుంచి సాగిస్తున్నాయి.



కొనసాగుతున్న పనులు

నెలలోపు పనులు పూర్తిచేస్తాం

ఎగ్జిట్-15 వద్ద పనులను నెలలోపు పూర్తి చేస్తాం. ఇక్కడ భారీ వాహనాలు రాకుండా భారీకేడ్లు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం. టోల్‌గేట్ల ఎత్తును కూడా పెంచుతున్నాం. వాహనదారులకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటాం.

– మీనాక్షి, డీఈ, హెచ్‌ఎండీఏ

క్లుప్తంగా...

నేడు హ్యాండ్లూమ్.. హ్యాండీక్రాఫ్ట్ మేళా

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి జీఆర్‌కే గార్డెన్ పక్కన ఉన్న ఖాళీస్థలంలో హ్యాండ్లూమ్, హ్యాండీక్రాఫ్ట్ మేళాను ఏర్పాటు చేశారు. సోమవారం ప్రారంభమయ్యే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ పాల్గొంటారని మేళా ఆర్గనైజర్ రాజశేఖర్‌రెడ్డి ప్రకటించారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

రాజేంద్రనగర్: మైలార్‌దేవ్‌పల్లిలోని మావి హెల్త్ కేర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో బాబుల్‌రెడ్డినగర్‌లో మహిళలు, కంటిసమస్యలు ఉన్నవారికి ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 200 మందికి జనరల్, కంటి పరీక్షలు నిర్వహించి తగిన జాగ్రత్తలు, మందులను పంపిణీ చేశారు. బీఆర్ఎస్ నాయకుడు ఎస్. శ్రీనివాస్‌గుప్తా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి పేదలకు వైద్యసాయం అందించినందుకు డాక్టర్లు మోనాల్, మోహన్‌దాస్ దంపతులను అభినందించారు. హైదరాబాద్, పాలమూరు కురుమసంఘం చైర్మన్ శ్రీనివాస్, నాయకులు మల్లేష్, శ్రీనివాస రాము, లక్ష్మణ్, కిష్టప్ప, హనుమంతు తదితరులున్నారు.

సెవన్ టూంబ్స్ వద్ద హెరిటేజ్ వాక్

గోల్కొండ: చారిత్రక కట్టడాలను భావితరాలకు కానుకగా ఇవ్వాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఐకోమాస్ ఇండియా ప్రతినిధి నవీన్ పిప్లానీ అన్నారు. ఆదివారం ఐకోమాస్ ఇండియా ఆధ్వర్యంలో గోల్కొండ కోట సమీపంలోని సెవన్ టూంబ్స్‌లో హెరిటేజ్ వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాంస్కృతిక వారసత్వ ప్రదేశాల పరిరక్షణ కోసం తాము కృషి చేస్తున్నామన్నారు. తాము వారసత్వ కట్టడాల ప్రమాణాలు, పద్ధతులను మెరుగుపరచడానికి కృషి చేస్తున్నామన్నారు. ఐకోమాస్ ఇండియా సౌత్ జోన్ కన్వీనర్ సూర్యనారాయణ, దాస్‌గుప్తా, వేద కుమార్, ఆగా ఖాన్ ట్రస్ట్ ఫర్ కల్చర్ సీఈఓ రఫీష్ నంద తదితరులున్నారు.

హిజ్రాల హత్య కేసులో ముగ్గురి అరెస్టు

విజయనగర్‌కాలనీ: ఐదురోజుల క్రితం ఇద్దరు ట్రాన్స్‌జెండర్ల హత్య కేసులో టప్పాచబుత్ర పోలీసులు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం.. సయ్యద్ ఇనాయత్(25), మహ్మద్ ఇనాయత్(25), సయ్యద్ ఖాలేద్(33) వీరు ముగ్గురు కార్పెంటర్ పనిచేస్తారు. వీరు ఈనెల 21న హిజ్రాలు అయిన సయ్యద్ యూసుఫ్ అలియాస్ డాలి, మహ్మద్ రియాజ్‌ఉద్దీన్ అలియాస్ సోఫియాను కత్తులతో పొడిచి, బండరాళ్లతో తలపై మోది హత్య చేశారు. దర్యాప్తు చేపట్టిన టప్పాచబుత్ర పోలీసులు ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని ద్విచక్ర వాహనాలతో పాటు కత్తులను, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

జూదం ఆడుతున్న ఆరుగురి అరెస్టు

జియాగూడ: జూదం ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసిన ఘటన కుల్సుంపురా పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ మన్మోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. గిరికపల్లి ఎస్‌బీఏ గార్డెన్ వెనుక గల వడ్డెర బస్తీలో బాంజావాడి, మంగళ్‌హాట్, కార్వాన్, జియాగూడ ప్రాంతాలకు చెందిన శివకుమార్(27), శంకర్‌లాల్ (43), రామ్‌కోటి (38), లక్ష్మణ్(49), అరుణ్(33), రాకేష్(26) జూదం ఆడుతున్నట్లు సమాచారం లభించడంతో టాస్క్‌ఫోర్స్ ఎస్‌ఐ ముజఫర్, కుల్సుంపురా పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.25 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.

బోనాలను వైభవంగా నిర్వహిస్తాం

లంగర్‌హౌస్: 30 ఏళ్ల నాటి లంగర్‌హౌస్ వాసుల కల నెరవేరిన వేళ ఈ సంవత్సరం బోనాల ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తామని బుజిలీ మహంకాళి ఆలయ కమిటీ చైర్మన్ ఆర్లె క్రిష్ణయాదవ్ అన్నారు. లంగర్‌హౌస్‌లోని ప్రధాన అమ్మవారి ఆలయం అయిన బుజిలీ మహంకాళి ఆలయ కమిటీ ఎన్నికలు ఆదివారం నిర్వహించగా పార్టీలకు అతీతంగా ఆర్లె క్రిష్ణయాదవ్‌ను చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా క్రిష్ణయాదవ్ మాట్లాడుతూ.. 30 ఏళ్లుగా లంగర్‌హౌస్‌లో బొడ్రాయి స్థాపించాలనే కల ఈ సంవత్సరం నెరవేరిందన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ఈ సంవత్సరమే తన కుమారుడు జగదీష్‌యాదవ్‌కు గోల్కొండ జగదంబిక ఆలయ కమిటీ చైర్మన్ పదవి, తనకు బుజిలీ మహంకాళి ఆలయ కమిటీ చైర్మన్‌గా ఎన్నుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. క్రిష్ణయాదవ్‌ను మాజీ కార్పొరేటర్ ఉదయ్‌కుమార్, బస్తీల పెద్దలు స్వామి, బోగి యాదయ్య, పరమేష్, ఇంద్రసేనారెడ్డి, నాగేంద్ర ప్రకాష్‌రెడ్డి సన్మానించారు.

బోనాల ఉత్సవాల కమిటీ ఏర్పాటు



దేవాలయ నిర్మాణానికి విరాళం అందజేత

బండ్లగూడ: భక్తి శ్రద్ధలతో నిర్వహించుకునే బోనాల ఉత్సవాల సందర్భంగా బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ హైదర్షాకోట్ పరిధిలో డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం గ్రామ పెద్దలతో కలిసి బోనాల ఉత్సవాల కమిటీని ఏర్పాటు చేశారు. చైర్మన్‌గా చేవెళ్ల యాదిరెడ్డి, డిప్యూటీ చైర్మన్‌గా ప్రతాప్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా నిర్మించిన గాలి పోచమ్మ దేవాలయం విగ్రహ ప్రతిష్ఠాపన తదితర విషయాలను చర్చించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతిని చాటి చెప్పే బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నామన్నారు.

- గాలి పోచమ్మ దేవాలయ నిర్మాణానికి చేవెళ్ళ యాదిరెడ్డి రూ. 1 లక్ష విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమవంతు బాధ్యతగా దేవాలయ నిర్మాణానికి విరాళం అందజేశామన్నారు. డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, రాజిరెడ్డి తదితరులున్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి

మంత్రి కేటీఆర్‌కు సన్మానం

అబిడ్స్: మంత్రి కేటీఆర్‌ను బాబూ జగ్జీవన్ రామ్ ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ సొసైటీ చైర్మన్, రాష్ట్ర బీఆర్ఎస్ నాయకుడు కొమ్ముల నరేందర్ ఘనంగా సత్కరించారు. భద్రాచలం నుంచి పట్టు శాలువాను తెచ్చి మంత్రి కేటీఆర్‌కు సత్కారం చేశారు. ఈ సందర్భంగా కొమ్ముల నరేందర్ మాట్లాడుతూ.. దళితులకు కేవలం తెలంగాణలోని బీఆర్ఎస్ ప్రభుత్వం అన్నివిధాల అండగా ఉందన్నారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయన్నారు.

బోనాల ఏర్పాట్లపై మంత్రి తలసాని సమీక్ష వాయిదా

చార్మినార్: పాతబస్తీలో బోనాల ఉత్సవాలు వైభవంగా నిర్వహించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఏర్పాట్లు, ఉత్సవాల నిర్వాహణ తదితర అంశాలపై మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అధ్యక్షతన సోమవారం సాలార్ జంగ్ మ్యూజియంలో జరుగనున్న సమావేశం వాయిదా పడినట్లు భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఆలే భాస్కర్‌రాజ్, గాజుల రాహుల్ తెలిపారు. పాతబస్తీ మహంకాళి జాతర ఉత్సవాల నిర్వహణ, ఏర్పాట్లపై వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో ప్రతి ఏడాది నిర్వహించినట్లుగానే ఈసారి ఈనెల 26న నిర్వహించడానికి తగిన ఏర్పాట్లు చేశారు.

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవం

చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్టలో బొడ్రాయి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం ఆదివారం కనుల పండువగా కొనసాగింది. తెల్లవారుజామున 3 గంటలకు చాంద్రాయణగుట్ట శివార్లలో బలి ఊరేగింపు నిర్వహించారు. ఉదయం 5.35 గంటలకు భక్తిశ్రద్ధల నడుమ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం కొనసాగింది. అనంతరం ఇంటింటి నుంచి మహిళలు సంప్రదాయ వస్త్రాధారణతో బోనాలు సమర్పించారు. కుమ్మరి సంఘం అధ్యక్షుడు నరహరి, కార్యదర్శి శ్రీహరి, కార్యనిర్వాహక కార్యదర్శి ఆర్.ప్రభుల పర్యవేక్షణలో ఆధ్వర్యంలో పోతరాజుల విన్యాసాల నడుమ 11 బోనాలను ఊరేగింపుగా తీసుకొచ్చారు. ధరంకార్ నాగరాజు, కరన్‌కోట్ సాయి, గాజుల వెంకటరమణ, గౌని అజయ్ కుమార్ గౌడ్, సతీష్ గౌడ్, మణిక్యాచారి, మహేష్ గౌడ్, గణేష్, నవీన్‌యాదవ్ పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ

గన్‌ఫౌండ్రీ: ప్రముఖ కవి ఆచార్య ఎన్.గోపి రచనలు ఎంతో సరళంగా ఉంటాయని పలువురు ప్రముఖులు కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో కవి ఎన్.గోపి రచించిన కవితా సంపుటి క్రియ ఒక జీవన లయ పుస్తకావిష్కరణ సభ ఆదివారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ పాత్రికేయులు కె.రాంచంద్రమూర్తి మాట్లాడుతూ.. వివిధ అంశాలపై తనదైన శైలిలో కవితలను రాయడం ఎంతో ప్రశంసనీయమన్నారు. ఉత్తర ప్రదేశ్ ఐపీఎస్ అధికారి సత్యనారాయణ, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, వాణిజ్య పన్నుల శాఖ విశ్రాంత జాయింట్ కమిషనర్ వి.హర్షవర్ధన్ పాల్గొన్నారు.

అమ్మవారికి మొక్కుల చెల్లింపు

అత్తాపూర్: గోల్కొండ జగదాంబ అమ్మవారికి అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడ ప్రణవ భక్త సమాజం ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం మాదిరిగానే ఆదివారం తొట్టెల, శివసత్తుల బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ సంగీతాగౌరీశంకర్ పాల్గొని మాట్లాడుతూ.. డివిజన్‌ను అభివృద్ధిలో అగ్రభాగానా నిలపాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. ప్రతి ఏటా ఆషాడంలో ప్రణవ భక్త సమాజం ఆధ్వర్యంలో బోనాలు, తొట్టెలను సమర్పిస్తామన్నారు. సమాజం అధ్యక్షుడు నరసింహ, నాయకులు మల్లారెడ్డి, అశోక్‌హరినాథ్, సుభాష్‌రెడ్డి, బజరంగ్‌రెడ్డి, మహిళలు పాల్గొన్నారు.



అమ్మవారికి మొక్కులు చెల్లిస్తున్న అత్తాపూర్ కార్పొరేటర్ సంగీతాగౌరీశంకర్

పేదలకు సాయం చేస్తే సంతృప్తి



మున్సిపల్ కార్మికులకు చీరల పంపిణీ చేస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

మణికొండ: మనకు ఉన్న దాంట్లో కొంతలేని వారికి ఇస్తే ఎంతో ఆనందం కలుగుతుందని అలాంటి సేవా కార్యక్రమాలను చేపట్టేందుకు వాసవీ క్లబ్ కపుల్స్ సిద్ధంగా ఉంటుందని మణికొండ వాసవీ క్లబ్ కపుల్స్ అధ్యక్షురాలు నిరీష అన్నారు. ఆదివారం సంస్థ ఆధ్వర్యంలో మణికొండలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు కృషిచేస్తున్న పోలీసులకు సన్మానం, నిరుపేదలకు నిత్యావసర సరుకులు, మున్సిపల్ కార్మికులకు చీరల పంపిణీ, మర్రిచెట్టు బస్ షెల్టర్లలో ప్రయాణికులు కూర్చునేందుకు బల్లలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సేవా కార్యక్రమాలు మనకు ఎంతో తృప్తినిస్తాయన్నారు. తమ సంస్థ సభ్యులు సేవా కార్యక్రమాల నిర్వహణకు ముందు వరుసలో ఉంటారన్నారు. సంస్థ కోశాధికారి వంశీకృష్ణ, జిల్లా కో-ఆర్డినేటర్ ఈశ్వర్ ప్రసాద్, జోన్ చైర్మన్ నవీన్, నాయకులు రామసురేష్ సభ్యులు పాల్గొన్నారు.

జులై 12న శోభన్‌బాబు అభిమానుల ఆత్మీయ సమ్మేళనం

నాంపల్లి: బహుముఖ నటనా చక్రవర్తి, తెలుగు సినీ సొగ్గాడు శోభన్ బాబు అభిమానులకు దూరమై 15 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా శోభన్ బాబు అభిమానుల ఆత్మీయ సమ్మేళనాన్ని జులై 12న బుధవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతి వేదికపై ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు జరుగుతాయని వాణీ గిరిజా సంగీత నాటక కళా సమితి అధ్యక్షుడు, శోభన్ బాబు జీవితకాలపు అభిమాని చల్లగాలి (ప్రతికంఠం) వెంకట్‌రాజు వెల్లడించారు. ఈ మేరకు నాంపల్లిలో ఆయన కార్యక్రమ వివరాలను మీడియాకు వివరించారు. శోభన్ బాబు మహోన్నతమైన వ్యక్తిత్వం గురించే కాకుండా ఆయన అభిమానుల నిస్వార్థ సేవా నిరతి గురించి తాను రాసిన స్థిత ప్రజ్ఞుడు అనే పుస్తకాన్ని రచించడం జరిగిందని, ఈ పుస్తకాన్ని జులై 12న రవీంద్ర భారతిలో ముఖ్యఅతిథుల చేతుల మీదుగా ఆవిష్కరించడం జరుగుతుందని తెలిపారు. ముఖ్య అతిథులుగా పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రులతో పాటుగా వివిధ కార్పొరేషన్లకు చెందిన పలువురు చైర్మన్లు హాజరవుతున్నట్లు తెలిపారు.

సీసీరోడ్డు పనుల ప్రారంభం

అత్తాపూర్: అత్తాపూర్ డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నానని కార్పొరేటర్ సంగీతా గౌరీశంకర్ అన్నారు. డివిజన్ పరిధిలోని ఓల్డ్ విలేజ్‌లో రూ.8 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. అభివృద్ధిపై అధికారులతో ఎప్పటికప్పుడు పోరాడుతూ పనులను చేపడుతున్నామన్నారు. కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు చెల్లించని కారణంగా పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. దశలవారీగా డివిజన్‌లో అన్ని రకాల మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామన్నారు. బీజేపీ నాయకులు స్టార్ చిన్న, విజయారెడ్డి, సరితారెడ్డి, ఎల్.వెంకటేష్ తదితరులున్నారు.



సీసీరోడ్డు పనుల ప్రారంభోత్సవంలో కార్పొరేటర్ సంగీతాగౌరీశంకర్

హాథ్ సే హాథ్ జోడో అభియాన్ యాత్ర



బండ్లగూడ: హాథ్‌సే హాథ్ జోడో అభియాన్ యాత్ర బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి భైరాగిగూడలో కాంగ్రెస్ పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు పూలపల్లి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ హాజరయ్యారు. కార్పొరేషన్ పరిధిలో ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల ఇచ్చిన హామీలను విస్మరించాయని ఆరోపిస్తూ.. ప్రజా సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఏ బ్లాక్ అధ్యక్షుడు నవీన్‌కుమార్, గణేష్, ప్రేమ్‌కుమార్, శ్రీనివాస్, అంకం శ్రీనివాస్, గంగనిరవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై కలిసి పనిచేద్దాం !

మణికొండ: హైదరాబాద్ నగర శివారులోని మున్సిపాలిటీల కాలనీ సంక్షేమ సంఘాలు ప్రధాన సమస్యలపై కలిసి పనిచేస్తే వాటి పరిష్కారానికి మార్గాలను కనుక్కోవచ్చని మణికొండ మున్సిపాలిటీ ఆల్‌కాలనీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు సీతారాం అన్నారు. ఆదివారం కార్యవర్గ సభ్యులతో కలిసి బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్, తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్‌లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రధాన సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రధాన సమస్యల పరిష్కారానికి రోడ్‌మ్యాప్‌లను సిద్ధం చేసి ప్రభుత్వ పెద్దలను కలవాలని నిర్ణయించారు. బండ్లగూడ సమాఖ్య తరపున నరేంద్రబాబు, రాధాకృష్ణ, నదీబ్, తెల్లాపూర్ సమాఖ్య తరపున రమణ, సుధాకర్, చైతన్య, నరేందర్‌రెడ్డి, మణికొండ ఆల్‌కాలనీస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, కాంతారావు తదితరులున్నారు.



పొదుపుతోనే ప్రగతి సాధ్యం



వార్షిక సమావేశంలో పాల్గొన్న సంఘం కార్యవర్గసభ్యులు

రాజేంద్రనగర్: పొదుపుతోనే ప్రగతి సాధ్యమని సత్యసాయి పొదుపు సంఘం అధ్యక్షుడు సూర్యనారాయణ అన్నారు. ఆదివారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని మార్కండేయనగర్‌లో సత్యసాయి పొదుపు సంఘం 23వ వార్షిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్కండేయనగర్‌లో 23 ఏళ్ల క్రితం 20 మంది సభ్యులతో సంఘం ఏర్పడి ఇప్పటి వరకు రూ.3.5కోట్ల టర్నోవర్, 900 మంది సభ్యులకు చేరుకుందన్నారు. సంఘం సభ్యులకు 12 శాతం వడ్డీతో వారి పొదుపును అనుసరించి రూ.లక్ష వరకు రుణ సౌకర్యం కల్పిస్తుందన్నారు. బ్యాంకులతో పోలిస్తే సంఘం ద్వారా సభ్యులు రుణాలు సరళంగా పొందగలుగుతున్నారన్నారు. సంఘం అభివృద్ధికి సభ్యులు సకాలంలో రుణాలను చెల్లించాలన్నారు. సంఘం వ్యవస్థాపకులు యాదగిరి, సలహాదారులు సత్యనారాయణ, కృష్ణ, వాసు, ఉపాధ్యక్షులు విష్ణు, ప్రధాన కార్యదర్శి శ్యామ్‌కుమార్, సహాయ కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి భాస్కర్‌లతో పాటు సభ్యులు పాల్గొన్నారు.

కౌశిక్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలి



నార్సింగిలో దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం

మణికొండ: ముదిరాజ్‌లను కించపరుస్తూ మాట్లాడిన ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డిపై తగిన చర్యలు తీసుకోవాలి గండిపేట మండల ముదిరాజ్ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం వారు నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలో కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. రాజేందర్, గణేష్, నారాయణ, సాయిరాం, ప్రవీణ్, వెంకటేష్‌ముదిరాజ్‌లు పాల్గొన్నారు.

బండ్లగూడ: జర్నలిస్టును కులం పేరుతో దూషించి, దాడికి పాల్పడిన ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని హైదర్షాకోట్ పీఏసీఎస్ చైర్మన్ రాందాస్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. ఆదివారం కాళీమందిర్ చౌరస్తాలో కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. బీఆర్ కృష్ణ ముదిరాజ్, యాదయ్య, బుచ్చయ్య, శ్రీను, బాలకృష్ణ, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



రక్తదాతలకు ధ్రువపత్రాలను అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

రాజేంద్రనగర్: రక్తదానంతో ఆపదలో ఉన్న వారి ప్రాణాలు నిలుస్తాయని ప్రతి ఒక్కరూ ప్రతి ఆరు నెలలకోసారి రక్తదానం చేయాలని దాతృతా ఫౌండేషన్ ప్రతినిధి కార్తిక్ అన్నారు. ఆదివారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని ప్రగతి పొదుపు సంఘంలో తలసీమియా వ్యాధిగ్రస్తుల కోసం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తలసీమియా వ్యాధిగ్రస్తులకు సికిల్‌సెల్ ఆసుపత్రి వారు రక్తం కొరత ఉందని తెలపడంతో వెంటనే శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రస్తుతం ఇతర రాష్ట్రాల నుంచి తలసీమియా రోగులు పెరగటంతో సరిపోను రక్తం అందించలేక పోతున్నామన్నారు. వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మైలార్‌దేవ్‌పల్లిలోని సికిల్‌సెల్ ఆసుపత్రికి ఎప్పుడైనా వచ్చి రక్తదానం చేయాలని కోరారు. ఫౌండేషన్ ప్రతినిధులు ధనుంజయ్, అఖిల్, రాకేష్, నగేష్‌లు పాల్గొన్నారు.

మృత్యుంజయ హోమం

జియాగూడ: జియాగూడ ఇమాంపురా నవభారత్ సంఘం అధ్యక్షుడు మదిర సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా గణపతి, మహా మృత్యుంజయ హోమాలు ఘనంగా జరిగాయి. ఆదివారం ఉదయం ఇమాంపురాలోని రేణుకాఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజ, ఇమాంపురా నవభారత్ సంఘం కమ్యూనిటీ హాల్ వద్ద గణపతి పూజ, పాలాభిషేకం, మహా మృత్యుంజయ హోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మదిర సత్యనారాయణ మాట్లాడుతూ.. ఇమాంపురా బస్తీలో ఇటీవల కొన్ని ఘటనలు జరిగినందువల్ల హోమాలు, ప్రత్యేక పూజలను నిర్వహించామన్నారు. సంఘం ఉపాధ్యక్షుడు జి.వినయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి వై.జస్వంత్ కుమార్, కోశాధికారి ఎం.మహేష్‌బాబు, సంఘం ప్రతినిధులు ఆర్.బాలకిషన్, డి.లక్ష్మీనారాయణ, వి.నర్సింగ్‌రావు, సి.నర్సింగ్‌రావు, డి.సంతోష్ కుమార్, జె.అర్జున్‌కుమార్, సి.సత్యనారాయణ, సి.శ్రీనివాస్, వై.యాదయ్య, ఎ.ప్రసాద్ పాల్గొన్నారు.

